# చరిత్రకందని చిత్రకథ

# మార్క్స్ -

- డాక్టర్ లత

"డార్లింగ్! ఈ వేళ నీవు చర్చికి రావా?" అంది మిసెస్ కారల్ మార్క్స్.

"లేదు, ప్రియా! ఈ పుస్తకం పూర్తి అయ్యే వరకూ కొంచెం వదిలి పెట్టు" అన్నారు కారల్ మార్క్స్.

"మన సంతాన నష్టానికీ, దరిద్రానికీ కారణం నీవు చర్చికి రాకపోటమే అని నేను అనుకోవచ్చునా?"

"అన్యాయం. నేను చర్చికి రానిది ఈ పుస్తకాలు వ్రాస్తున్నప్పుడు మాత్రమే."

"జర్మనీ నుంచి ఫ్రాన్సు, ఫ్రాన్సు నుంచి ఇంగ్లండుకూ వెళ్ళగొట్టబడి, సరి అయిన తిండి లేక పడుతున్న బాధల్ని అధిగమించి, నీవు ఇరవై నాలుగు గంటలూ వ్రాస్తున్న ఈ పుస్తకాలు మానవాళికి ఉపయోగ పడినా, పడక పోయినా ఈశ్వరుడు ఉపయోగపడతాడని నా అభిప్రాయం" అంది మిసెస్ కారల్ మార్క్స్.

"కావచ్చు. కాకపోవచ్చు. ఈ పుస్తకాలు విలాసయుల ధనిక వర్గం నుంచి బడుగు ప్రజానీకాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసే పుస్తకాలు: దా కాపిటల్. కమ్యూనిస్టు మానిఫెస్టో."

"పుస్తకాల పేర్లు నాకు తెలుసు. అతీతమైన దైవాన్ని గురించి నా ప్రశ్న."

"నేను చర్చికి వస్తూ ఉండటమే నీ ప్రశ్నకు సమాధానం కాని, అసంఖ్యాక జనసందోహం తిన తిండీ, కట్ట గుడ్డా, ఉండటానికి గూడూ లేక బాధ పడుతున్నప్పుడు వాళ్ళను మేలుకొలపటం మన బాధ్యత. అది ఈ శతాబ్దంలో విజయం కాకపోవచ్చు. కాని, ముందు ముందు ప్రపంచ జనాభాలో చాలా మంది సుఖ జీవనం చేసేందుకు ఈ పుస్తకాలు ఉపయోగ పడతాయి. అయితే, ప్రజాస్వామ్య ప్రభుత్వం వల్ల కొన్ని బాధలూ ఉంటాయి-బ్యూరోక్రసీ, ప్లూటోక్రసీ, సూడో కమ్యూనిజం లాటివి. కాని, ప్రజలు వాటిని అధిగమిస్తారని నా ఆశ" అన్నాడు కారల్ మార్క్స్.

మిసెసు మార్క్స్ నిట్టూర్చి, "నా కలాటి ఆశ ఏదీ లేదు. మనశ్శాంతి కోసం చర్చికి వెళ్ళడం తప్పు" అన్నది.

మార్క్స్ మహాశయుడు లేచి, ఆమె తల వాత్సల్యంగా నిమురుతూ, "బేలగా మాట్లాడకు. నీ దైవ భావాన్ని నే నెన్నడూ అగౌరవ పరచలేదు. రాబోయే తరాల వారు అలాటి అర్థాలు తీస్తే తీయువచ్చు గాక! నేను చర్చిని అగౌరవ పరచను. అతి సంగ్రహంగా ఒక వాక్యంలో చెప్పాలంటే ప్రస్తుతం నేను భౌతిక సుఖ జీవిత నిర్మాణాన్ని మాత్రం దృష్టిలో ఉంచుకున్నాను. అయినా ఆహారం దొరికాక ఆధ్యాత్మికాన్ని గురించిన ఆలోచన. ప్రస్తుతం ధనిక వర్గానికీ, మిగతా ప్రజానీకానికీ జరుగుతున్న యుద్ధం నా పుస్తకానికి మూలం. మతాన్ని కాదన వచ్చు కాని, దైవాన్ని కాదనను, చెలీ! నాకు షేక్స్పియర్ అభిమాన రచయిత. అలెగ్జాండర్ డ్యూమా కూడా అంతే. ఎప్పుడయినా ఆ మహారచయితల్ని అభిమానించిన వారు దెయ్యాల్నీ, చేతబడుల్నీకూడా నమ్మక తప్పదు. నేను నమ్మను, ఊరికే చదువుతున్నాను—అంటే ఎవరూ నమ్మరు. సరిగదా నవ్వుతారు. కాని, ప్రపంచంలో ప్రజాస్వామ్యం కోసం నా తపన. లోట్లు ఉన్నా సరే—ప్రజలే ప్రభువులు కావాలి" అన్నారు.

"సరే. భవిష్యత్తులో చర్చి మూత పడదని గారంటీ ఇవ్వగలరా?"

"ఇవ్వగలను. దేశంలో వచ్చిన విప్లవానంతరం దేశ పునర్నిర్మాణ కాలంలో దైవాన్ని కొద్దిగా అశ్రద్ధ చేయువచ్చు, ముందు బ్రతకాలి కనక. కాని, ప్రియా! తరవాత కళల్నీ, దైవాన్నీ గురించి ఆలోచించక తప్పదు."

(ఈ మధ్య రష్యాలో చర్చిలు తిరిగి తెరిచారట. ఆ విషయం గురించి నేనొక రష్యన్‌ను అడిగాను. 'ఈ అరవై నాలుగేళ్ళ స్వాతంత్ర్యంలో మేము మా దేశాన్ని పునర్నిర్మించుకున్నాం. ఇప్పుడు దైవాన్ని గురించి ఆలోచించే తీరిక మాకు చిక్కింది' అని ఆ కామ్రేడ్ చెపితే నేను చాలా ఆశ్చర్యపోయినాను.)

"అప్పటికి మనం ఉండం" అంది మిసెస్ మార్క్స్, సాలోచనగా.

"చెలీ! మన బిడ్డ మన కళ్ళ ముందే లేకుండా పోయింది కదా? ఆఖరికి కాఫిన్‌కూ, చివరి వస్త్రానికీ కూడా గతి లేకుండా పోయింది కదా? మన కడుపు శోకం ఎవరు తీర్చారు? అలాగే మనం పోతే లోకానికి విచారమా? చాలా మంది సుఖంలోనే మన జీవిత సాఫల్యం ఉంది అనుకుందాం" అన్నాడు కారల్ మార్క్స్.

"ఏది కనపడదో దానికి కనపడే దానితో సంబంధం ఉండదు అని నువ్వు వ్రాసిన దానికి ఆధ్యాత్మిక వాదం అర్థశూన్యం అనే అర్థం వచ్చే అవకాశం ఉన్నది కదా?"

"అది వక్ర నిర్వచనం, ప్రియా! నా జీవిత కాలం ఇంకా ముగియక ముందే నేను చెప్పిన వాటికి అపార్థాలు కల్పించ బడుతున్నాయి. ఐశ్వర్యవాలా అంటే దళారి అని నా ఉద్దేశ్యం. భాగ్యవంతుడని భాష్యం. అదలా ఉండనీ. నీవు రాజకుమారివి. నా లాటి నిర్భాగ్యుడితో జీవించటం నీకు కష్టంగా లేదా?"

"లేదు. నీ తోటిదే నా బ్రతుకు. చర్చికి రావా?"

"సంగీతం వినటానికి రావాలనే ఉంది. కాని, ఈ పుస్తకం వ్రాస్తున్నాను కదా? ఒక వ్యక్తి తను నాస్తికుణ్ణి అంటే అతనికి భాష రాదని నా ఉద్దేశం. మూడో తాత్త్వికులు తమరు చాలా పండితులని అనుకోవటం జరుగుతుంది."

"నీవుకూడా ఈ ఉత్పత్తి శక్తులు ఎట్లా పుట్టినవి, ఎట్లా మారినవి అనే విషయం సరిగా వ్రాయలేవు. ఎందుకంటే అవి ఆలోచనకు అందనివి కనక. కాని, నీకు భాష్యం చెప్పేవాళ్ళు నీవు చెప్పినట్లు చాలా విషయాలు వ్రాస్తారు. అనువాదకులు మరీ పొరపాట్లు చేస్తారు. ఏది ఏమయినా, డార్లింగ్! నీవు దైవానికి ప్రతికూలం కాదు. నా కంతే చాలు" అన్నది మిసెస్ మార్క్స్.

"కాదు. నేను షేక్స్పియర్ భక్తుణ్ణి. నీ పాదాను దాసుణ్ణి. నీ బిడ్డలకు తండ్రిని. నీ జీసస్‌కూ అంతే. కాని, నాకు ఈ పుస్తకాలు పూర్తి చేసే అవకాశం కల్పించు" అన్నారు కారల్ మార్క్స్.

"నీవు ప్రపంచంలో నూతన తత్త్వవేత్తవుగా ఆవిర్భవిస్తుంటే నీ ప్రియురాల్ని నాకు గౌరవం కాదా? నేను చర్చికి పోతాను. నీకు తీరిక అయినప్పుడే నీవు వద్దువు గాని" అంది మిసెస్ మార్క్స్.

(రాధాకృష్ణన్ నించి, లక్ష్మి రఘురాం నించి, సరిపల్లె విశ్వనాథశాస్త్రి నించి, కారల్ మార్క్స్ జీవితం నించి పై చిత్రకథకు ఆధారాలు దొరికినవి.)

